


# ఆరతి

పాండ్రంకి సుబ్రమణి

**కళ్యాణి కాయగూరల సంచీతో ఇంట్లోకి ప్రవేశిస్తూ అప్రయత్నంగా తలెత్తి చూసింది. పక్కింటి డాబాపైనుంచి అతడు అదేపనిగా చూస్తూ నిల్చున్నాడు.**

అతడు తనను అలా కొన్ని రోజులుగా కన్నార్పకుండా చూస్తున్నాడని తను కనిపెట్టింది. కాని అతడి చూపులు ఇంత తీక్షణంగా అశ్లీల సెగలను వెదజల్లుతున్నాయని గ్రహించి ఆమె ఒళ్ళు కోపంతో వణికింది. ఆమె విసురుగా ముఖం తిప్పుకొని లోపలకు వడివడిగా వెళ్ళిపోయింది.

"ఛీ! ఏమి మొగాళ్ళు! ఎన్నడూ ఆడవాళ్ళని చూడనట్లు చూస్తారు!" కళ్యాణి గట్టిగా గొణుక్కుంది.

"ఏమిటే అలా ముఖం పెట్టుకొని వస్తున్నావు! కాయగూరల ధరల్ని మళ్ళీ పెంచేశారా? వాళ్ళనని ఏం ప్రయోజనమే! వ్యాపారలక్షణమే అంత!" మాణిక్యమ్మ కూతురి కోపానికి అర్థాలు కనిపెడుతూంది.

"ధరలగురించి తరవాత మాట్లాడుకుందాంగాని—ముందు మన తలరాతల గురించి ఆలోచించమ్మా! మన పక్కింటి డాబాపైకి కొత్తగా వచ్చాడే ఒకతను— అతనెవరు?"

"అతనా! ఏదో మందుల కంపెనీలో ఉంటున్నాడట. ఆ కుర్రాడు ఆ డాబా గదిలో దిగి మూడు వారాలవుతుందే. అతణ్ణి నువ్వింతవరకూ చూడనేలేదా?" ఆ మూడు వారాలలోపున అతణ్ణి చూసి వుండకపోవడం తన లోపం అన్నట్లు తల్లి మాటలు ధ్వనించడం విని కళ్యాణి కనుబొమలు ముడివడ్డాయి. కాయగూరల సంచీని చెల్లికి అందిస్తూ, "నా తలరాత! చెప్పేది పూర్తిగా వినిపించుకోనంటావమ్మా! ఆ మహాపురుషుణ్ణి నేను కూడా చూశాను. కాని...." అంతలో ప్రమీల అక్కయ్య మాటకు అడ్డువచ్చి అంది. "అతణ్ణి నేను కూడా చూశానక్కయ్యా."

"చూశావు కదా! సంతోషం. ముందు కాయగూరల సంచీని లోపల పెట్టు. నేను చెప్పేది అదికాదమ్మా. అతడు బొత్తిగా సభ్యత లేని మనిషిలా కనిపిస్తున్నాడు. అతడి చూపులు నాకు నచ్చలేదు. అతడి వాలకం బొత్తిగా నచ్చడం లేదు."

"నీవేప్పు గుర్తుప్పగించి చూశావా అక్కయ్యా?" సంచీని లోపలపెట్టి పరుగెత్తుకొచ్చి అడిగింది ప్రమీల.

"నీవేపుమాత్రం చూడకూడదని ఏదైనా గిరిగీసుకొని కూర్చున్నాడా?" ప్రమీల ఇక మాట్లాడడం క్షేమకరంకాదని ఊరుకుంది.

"నువ్వు చిన్నపిల్లవు. అవేమీ నీకు అర్థంకావు. నువ్వు లోపలకు వెళ్ళు". పెద్దకూతురి కోపాన్ని తగ్గించడానికి మాణిక్యమ్మ కలుగజేసుకొని అంది. ప్రమీల దూరంగా జరిగి వంట గది గుమ్మం దగ్గర నిల్చుంది.

కూతురి ముఖం ఇంకా కోపంగా ఉండడం గమనించి "పోనీలేవే కళ్యాణీ! నువ్వు అతణ్ణి లక్ష్యపెట్టకు. అతడే విసుగెత్తి తల ముడుచుకుంటాడు" గుండ్రటి కూతురి ముఖాన్ని ఆప్యాయంగా చూసి అంది మాణిక్యమ్మ.

"నీకు తెలియదమ్మా. దారినపోయేవారిని చూడటం నేరమని నేనడంలేదు. చూసే హక్కు అందరికీ ఉంది. కాని అదే పనిగా స్త్రీలను రెప్పపాటు లేకుండా చూడటం అసభ్యకరం." మాణిక్యమ్మ మాట్లాడలేదు. కాసేపాగి, "అనవసరంగా ఆవేశపడకే కళ్యాణీ! ఆ కుర్రాడు మరీ అసభ్యకరంగా ప్రవర్తించాడంటే మీ నాన్నగారికి చెబుతాను."

"అటువంటి పనిచేసేవు! ఇప్పటికే నాన్న లెక్కలేనన్ని సమస్యలతో తల మునకలవుతున్నారు. ఇంతకీ దీనిని సమస్యగాఎందుకు తీసుకోవాలి? ఇదొక న్యూసెన్సు. దీనిని నిర్లక్ష్యం చేయడమే సబబు."

"అక్కయ్యా." సోము దగ్గరకు వచ్చి పిలిచాడు.

"ఏమిట్రా? మళ్ళీ పెన్సిలు పోగొట్టుకున్నావా?" తలాడించాడు.

"మరేమిటి?"

"మొన్న ఆ డాబాపై వున్నతను నన్ను పిలిచాడు."

"........" తల్లీ కూతుళ్ళు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. వాడు తెచ్చిన భోగట్టా ధూళి రేపుతూ ఎదుటవచ్చి నిలుచున్న ట్రాక్టరు ఇంజనులా ధ్వనించింది.

"ఏమన్నాడు?"

"నా పేరడిగాడు."

"తరవాత?"

"స్కూలు పేరడిగాడు."

"అంతేనా?"

సోము బుర్రూపాడు.

"నువ్వెళ్ళు. ఆగాగు. మరోసారి అతడు పిలిస్తే వెళ్ళకు."

"అక్కయ్యా! అతడు మంచివాడే! అడిగిన వెంటనే రెండు కామిక్సు పుస్తకాలు తెచ్చిచ్చాడే!"

"నోర్మూయ్! ఇంత కుంకవిలేవు. అడ్డమైన వాళ్ళందరితోనూ స్నేహాలు! మరోసారిగాని ఆ డాబాపైకి వెళితే కాళ్ళు విరగ్గొడతాను. వెళ్ళు."

*　　*　　*

ఒక శుక్రవారంనాడు కళ్యాణి తలంటు పోసుకొని. ఇంటిముందున్న అరుగుపైన కూర్చుని జుట్టు ఆరబోసుకుంటున్నప్పుడు "గుడ్ మార్నింగ్" అని ఎవరో పలకరించడం విని తలెత్తిచూసింది. ఆమె ఉలికిపడ్డట్టయి లేచి నిల్చుంది. విసురుగా కేశరాశి ఆమె తెల్లటి మెడను కప్పివేసింది. అతడిలో మాత్రం ఎటువంటి చలనమూ కనిపించలేదు. హాయిగా. తరచుగా వచ్చే అతిథిలా నవ్వుతూ చూస్తున్నాడు.

"ఎవరు కావాలి?"

"సోము మూడు రోజులుగా కనిపించడం లేదు. ఒంట్లోగాని ఏమైనా చేసిందాండీ?" ఎంత చొరవ! ఎంత ధైర్యం! సోముని



అడ్డం పెట్టుకొని నేరుగా ఇంటికి వచ్చేశాడన్నమాట!

"మిస్టర్! సోము లోపల ఉన్నాడాండీ?"

"పరీక్షలకు చదువుకుంటున్నాడు."

"ఐసీ! కామిక్సు పుస్తకం తెచ్చిస్తానని ప్రామిస్ చేశాను. ఇది వాడికి ఇచ్చేయండి."

"దయచేసి పుస్తకం తీసుకువెళ్ళండి. ఈ సమయాన ఇవి చదివితే పరీక్షలు పాడవుతాయి." అతను ఓ సారి ఆమె ముఖంలోకి తేరిపార చూసి "సరే" అని వెనుతిరిగాడు. అంతలో "సార్" అని సోము పిలవడం విని ఆగాడు. కాని సోము మెట్లుదిగిరాలేదు. అతడే మెట్ల దగ్గరకు వెళ్ళి "ఏమిటోయ్ విశేషం? పరీక్షలు ఎలా సాగుతున్నాయి?" అని ఆప్యాయంగా అడిగాడు.

"పరీక్షలా!"

"మీ అక్కయ్య చెప్పిందిలే. బాగా చదువు. ముఖ్యంగా లెక్కలు ప్రాక్టీసు చేయి." సోము బిక్కముఖం వేసుకుని నిలుచున్నాడు. ఏం జవాబుచెప్పాలో వాడికిఅర్థం కాలేదు. వాస్తవానికి వాడు లోపల చదవడం లేదు. చిన్నక్కయ్యతో కలసి క్యారమ్సు ఆడుకుంటున్నాడు.

"లోపలకు రండి సార్! మా చిన్నక్కయ్య కాఫీ బాగా చేస్తుంది. ఐ ప్రామిస్!" ఇది విని అతడు చిన్నగా నవ్వాడు.

"నువ్వు పెద్దవాడివయిన తరవాత ఆహ్వానించు-తప్పకుండా వస్తాను" అతడు వడివడిగా వెళ్ళిపోయాడు.

"అక్కయ్యా!" జుట్టుముడివేసుకుంటూ చూసింది కళ్యాణి.

"నువ్వే కదూ చెప్పావు. మనింటికి ఎవరు వచ్చినా మొదట కూర్చోమని చెప్పాలని. శ్రీనివాసరావు గారిని ఎందుకు పిలవలేదు? నీతో మాట్లాడను పో!" సోము విసురుగా వెళ్ళిపోయాడు. అందరినీ ఇంట్లోకి రానివ్వడానికి ఇదేమైనా సత్రమా? అయినా అతడిపైన తమ్ముడికెందుకింత అభిమానమో ఆమెకు అర్థం కాలేదు. లోపల మాత్రం శ్రీనివాసరావుని గుమ్మం వద్ద నిల్చోబెట్టి మాట్లాడడం భావ్యం కాదేమో నన్న భావం సన్నగా మెదలి ఆ తరవాత మటుమాయమయింది.

*　　*　　*　　*

సోము డాబా పైకి వెళ్ళడం మానుకున్నాడు. అక్కయ్య ఆదేశం బలమైనదని, దానికి ఎదురులేదని వాడికి తెలుసు. అందుకే తను తెచ్చుకున్న కామిక్సు పుస్తకాలను శ్రీనివాసరావుకి అందజేర

# కరుణామయుడు

కరుణామయుడు కదలివచ్చాడు
పరలోకాన్నే వదలివచ్చాడు
దూతగణ పరివృతుడు
పాపి హృదయాక్రందన విన్నాడు
శిలువ బలిపీఠంపై
రక్త యజ్ఞమై
ముక్తి ప్రసాదించాడు
అక్షయలోకానికి మార్గం
తానయ్యాడు
అనంతుడు మనకోసం
మనిషై జన్మించాడు
నిశ్శబ్దంలో శబ్దమై వినదించాడు
నిశీధిలో వెన్నెల వెలయించాడు
బీడువారిన గుండెలు
శాద్వల వనభూములు చేశాడు
చూడు-



కరుణామయుడు కదలివచ్చాడు
శిధిల లోక సదనానికి
ప్రేమకుసుమాలు తెచ్చాడు!

—కె. బి. డేవిడ్ లివింగ్‌స్టన్

దానికి కూడా ధైర్యం చాలక, దూరంగా జరుగుతూ, కళ్ళు బెదకుండా తప్పుకుంటూ తిరుగుతున్నాడు.

ఒకరోజు సోము ఆపసోపాలు పడుతూ బజారు వీథిలో పరుగెత్తుతున్నాడు. అప్పుడు ఎక్కడినుంచో ఒక మోటార్ సైకిల్ ఘీంకరిస్తూ వాడికి అడ్డంగా వచ్చి ఆగింది. వాడు ఒక్కపాటున అదిరిపోయి చెదిరిపోయిన గుండెను అదిమి పట్టుకొని కోపంగా చూశాడు. మోటార్ సైకిల్ పైనున్న శ్రీనివాసరావుని చూసి వాడి ముఖం విప్పారింది. కాని కామిక్సు పుస్తకాలను తలచుకొని కలత చెందాడు.

"మోటార్ సైకిల్ కొత్తదా సార్!" అతడు నవ్వు ముఖంతో తలాడించాడు. సోముఆశ్చర్యంతో మోటార్ సైకిల్ చుట్టూ ఓ సారి ప్రదక్షిణం చేసి, హేండిల్‌ని స్పృశించి, "మీదేనా సార్"అని అడిగాడు.

"అవును."

"సారీ సార్."

"ఎందుకు?"

"మీ కామిక్సు పుస్తకాలు ఇంకా తిరిగి ఇవ్వలేదు."

"అందులో నీ తప్పేముందోయ్! మీ అక్కయ్య వద్దంది-నువ్వు రాలేదు. పెద్దవారి మాట వినడం మంచిదే కదా! అవును గాని, చేతిలో ఏదో ఉన్నట్లుంది, ప్రిస్క్రిప్షనా?"

"అవును సార్! నాన్నగారికి మళ్ళీ గుండెనొప్పి వచ్చి, జ్వరంకూడా ఎక్కువయింది."

"ఇంత ముఖ్యమైన దానిని ఇలాగా గాలిలో ఎగరేస్తూ వెళ్తున్నావు? ఏదీ చూడనియ్యి" అని ప్రిస్క్రిప్షన్ అందుకున్నాడు. కాసేపు పరీక్షగా చూసి "అదేమిటోయ్. చేతిలో ముప్ఫై రూపాయలే ఉన్నాయి. లిస్టు ప్రకారంచూస్తే నూరు రూపాయలవరకూ అవుతుంది. మీ అక్కయ్య ఆదరాబాదరాగా చేతిలో డబ్బులు పెట్టినట్లుందే!"

"అక్కయ్య చూసే డబ్బులిచ్చింది సార్."

"నిజంగానా?"

"ఇంట్లో డబ్బులంతే వున్నాయి సార్. నాన్నగారి జీతం అప్పుల వాళ్ళకు ఇవ్వడానికే సరిపోవడం లేదని అమ్మ చెప్పింది. అక్కయ్య ముఖ్యమైన మందులు మాత్రం మార్కుచేసి పంపించింది."

"నన్నడిగితే, అన్ని మందులూ మీ నాన్నగారి వ్యాధికి అవసరమంటాను."అని పర్సులోనుంచి ఓ నూరు రూపాయల నోటు తీసి అందిచ్చాడు. సోము తుళ్ళిపడ్డట్టు చూశాడు. ఆ తరవాత ఏమనుకున్నాడో ఏమో- అక్కణ్ణుంచి వడిగా పరుగెత్తాడు. శ్రీనివాసరావు శక్తికొద్దీ పరుగెత్తుతూన్న సోము వేపు చూస్తూ, మోటారు సైకిల్‌ని స్టార్టు చేశాడు.

* * *

ఆ రోజు సాయంత్రం దీపాలు పెట్టే వేళ ఆసన్నం కావడంవల్ల కళ్యాణి లాంతరు గ్లాసుని గుడ్డతో శుభ్రం చేస్తూ కూర్చుంది. ఆ వీధికి కరెంటు సప్లయి వుంది. బిల్లు కట్టడం ఆలస్యం చేయడంవల్ల ఎలక్ట్రిసిటీవాళ్ళు ఆ ఇంటి కరెంటు కట్ చేశారు.

"గుడ్ ఈవినింగ్!" ఆమె వెంటనే తలెత్తి చూడలేదు. ఆ పలకరింపు ఎవరిదో ఆమె పోల్చుకోగలిగింది. ఆమె మెల్లగా తలెత్తి ప్రశ్నార్థకంగా చూసింది. పంచె కట్టుకు పైన లాల్చీ వేసుకొని నిలుచున్నాడు. అతడు ఆమెను నిదానంగా చూసి లోపలకు నడిచాడు. "మిస్టర్ మిమ్మల్నే! ఎక్కడికి?"

"సోము తల్లి మాణిక్యమ్మ గారితో మాట్లాడాలి." అంటూనే లోపలకు ప్రవేశించాడు. అప్పుడు"ఎవరు కళ్యాణీ?"అంటూ అక్కడికి వచ్చిన మాణిక్యమ్మ నివ్వెరపాటుతో చూసింది.

"నమస్కారమండీ! ఉదయం సోముని దారిలో చూశాను. వాళ్ళ నాన్నగారికి మందులు తేవడానికి పరుగెత్తుతున్నాడు. వాడికి ప్రిస్క్రిప్షన్‌లోని మందులన్నీ దొరికి ఉండవనే నా అభిప్రాయం."

మాణిక్యమ్మ అతడి ముఖంలోకి తేరిపార చూస్తూ నిలుచుంది.

"నా పేరు శ్రీనివాసరావు. నేను మందుల కంపెనీలో సీనియర్ సేల్సు రిప్రజంటేటివ్‌గా ఉంటున్నాను. డాక్టరు సోము నాన్నగారికి వ్రాసిచ్చిన మందులు కొన్ని ఈ చుట్టుప్రక్కల దొరకవని నాకుతెలుసు. మీకు ఆక్షేపణ లేక పోతే ఆ చీటీ నాకు అందివ్వండి. మా హెడ్డాఫీసు ద్వారా తెచ్చివ్వడానికి ప్రయత్నిస్తాను. బిల్లు ఇచ్చిన తరవాత మీరు సొమ్ము పంపిద్దురుగాని."

"శ్రీనివాసరావుగారూ!" అతడు వెనక్కి తిరిగి చూశాడు. ప్రశాంతపూర్వకంగా పిలుస్తూనే ఎంతటి దార్ఢ్యం చూపించింది!

"మీరు చెప్పడం పూర్తయిందా?"

ఆ గొంతులో వెటకారం వుందా లేక నిర్లక్ష్యం వుందా- తేల్చుకునేందుకు ఎంత కష్టం! అతడు అబ్బురపడుతూ చూశాడు. అతడు మెల్లగా గుమ్మంవేపు కదలి మళ్ళీ ఆగిపోయాడు.

"దయచేసి నేను చెప్పేది వినండి."

"మీరు అనవసరంగా శ్రమ తీసుకుంటున్నారు. ఒకరి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడవలసిన పరిస్థితి మాకు ఏర్పడలేదు. ఇక ముందు ఏర్పడదని కూడా తలపోస్తాను."

అతడు వెళ్ళిపోయాడు.

*  *  *

చేతిలో పుస్తకాలు పట్టుకొని ప్రమీల పరధ్యానంగా నడుస్తోంది. 'ఈ నెల ఫీజు కట్టడానికి అక్కయ్య దబ్బులు లేవంది. మరి స్పెషల్ ఫీజు గతేమిటి? నాన్నకు ఈ యేడాది బోనస్ దొరికేందుకు మరో పదిరోజులు పడుతుంది. అక్కయ్య ఎంత తెలివైనదయితే మాత్రం, పాత్రలో ఏమీ లేనిదే అది మాత్రం ఏం చేస్తుంది. తండ్రి ఒక్కడి అనారోగ్యం వల్ల కుటుంబ పరిస్థితి ఎంత ఘోరంగా తయారయింది! ఒకసారి తమ స్కూలులో ఒకఫాదరు ఇచ్చిన ఉపన్యాసం జ్ఞప్తికి వచ్చింది.

ఒక కుటుంబంలో తండ్రి ఒక ట్రైను వంటి వాడు. ఆ ట్రైను నిదానంగా సాగిపోతున్నంత వరకు, పా[illegible] అంటే కుటుంబసభ్యులకు ఏమీ తెలియదు. ఆ ట్రైను గానిదురదృష్టవశాత్తు జారిపడితే ప్రయాణీకుల గతి అధోగతి అవుతుంది. అందుకే ప్రతీ తండ్రీ అనారోగ్యానికి తావివ్వకూడదు. చెడు అలవాట్లకు లోనవకూడదు. నేడు తమ కుటుంబం కూడా దాదాపు జారిపడిన ట్రైనులాగే తయారయింది!' బాధగా అనుకుంది ప్రమీల.

"హలో ప్రమీలా!" అంటూ ఓ యువకుడు ఆమెను రాసుకుంటూ పక్కకు వచ్చి నిల్చోవడం చూసి ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి. ఓ క్షణం నోటమాట రాక భయంగా చూసింది.

"ఈ మధ్య ఎందుకు కనిపించడం లేదు ప్రమీ! నీకోసం ఎంతగా పరితపిస్తున్నానో తెలియదా?" ప్రమీల ముఖం కందగడ్డలా తయారయింది.

"మిస్టర్ కిరణ్! మర్యాదగా ప్రవర్తించండి. దారిలో ఏమిటీ దుడుకుతనం!"

"దారిలో వద్దంటే బీచ్ కి వెళదాం."

"షటప్!" అని గట్టిగా అరచి తలెత్తి చూసేటప్పటికి ఘీంకరిస్తూ ఓ మోటార్ సైకిల్ వాళ్ళ మధ్యకు వచ్చి ఆగింది. దానిపైనుంచి నవ్వుతూ శ్రీనివాసరావు దిగి దానిని ఓచోట కుదురుగా నిల్చోబెట్టి వాళ్ళను సమీపించాడు. అతడు ముందు కిరణ్ వద్దకు వెళ్ళి, "గుడ్ మార్నింగ్ ఫ్రండ్ మీకభ్యంతరం లేకపోతే ఓ చిన్న సలహా యిస్తాను. ఇష్టంలేని అమ్మాయిల భుజాలురాసుకుంటూ తిరగడం భావ్యంకాదు. ముఖ్యంగా క్షేమకరంకాదు" అన్నాడు.

"హూ ఆర్ యు?" తీక్షణంగా చూస్తూ అడిగాడు కిరణ్. అది కేవలం నటన అని భయం కప్పిపుచ్చుకునేందుకు చేసే ప్రయత్నమని శ్రీనివాసరావుకి తెలుసు. అందమైన ఓ అమ్మాయి ప్రక్కన నిల్చొని తొణకకుండా మాట్లాడాలంటే ధైర్యం ఉండాలి. అంతకంటె ముఖ్యంగా వయసు ఉండాలి. స్కూళ్ళకు, కాలేజీలకు వెళ్ళే కుర్రాళ్ళకు ఇవి ఉంటాయంటే శ్రీనివాసరావు నమ్మడు.

"ముందు దీనికి బదులివ్వండి. నా సలహాను స్వీకరిస్తారా? లేక స్వీకరింపజేయమంటారా?" ఎత్తుగా ఆజానుబాహుడిలాకనిపిస్తూన్న శ్రీనివాసరావుని ఓసారి ఎగాదిగా చూసి, ఆ తరవాత ప్రమీలను నిశితంగా పరీక్షించి విసురుగా వెళ్ళిపోయాడు.

"థాంక్స్."

"ఎవరతను?"

"మా కాలేజీ మేట్. ఎస్టేటు ఓనర్ కొడుకు."

"చాలా రోజులనుంచి తిరుగుతున్నాడా?" ఆమె మౌనం వహించి ఆ తరవాత నవ్వి బుర్రూపింది.

"రౌడీలకు నాయకుడా?" ఆమె బదులివ్వలేదు.

"మంచి కుర్రాడేనా?" ఆమె ఈసారి కూడాబదులివ్వలేదు. శ్రీనివాసరావుకి కిరణ్ పైన అప్రయత్నంగా జాలి కలిగింది. ఆడదాని అంతరంగాన్ని అర్థం చేసుకొని మెసలగల అనుభవం లేనివాడు! ఇకపైన ఈ సంభాషణను కొనసాగించడం మంచిది కాదని తలచి "ఈ మధ్య మీ తమ్ముడు నల్లపూసయిపోయాడు. స్కూలు ఎగగొట్టి బంధువులింటికి వెళ్ళాడా?" అని అడిగాడు. ఆమె బదులివ్వకుండా తల అడ్డంగా తిప్పింది.

"అదేమిటండీ ప్రతిదానికీ మౌనంతో బదులిస్తున్నారు?" శ్రీనివాసరావు విసుగ్గా అడిగాడు. ఆమె బదులివ్వడానికి ప్రయత్నించి విఫలురాలయింది. కన్నీటి చుక్కలు చెంపలమీదుగా రాలి పడసాగాయి. నిశ్శబ్దంగావున్న మేఘం. చటుక్కున వర్షించ నారంభిస్తే ఇలాగే వుంటుందేమో,

"ఎక్కడైనా పడి కాలు విరగగొట్టుకున్నాడా?"

"వారం రోజులుగా సోముకి జ్వరం.



ఇప్పుడు జ్వరం తగ్గినా మంచందిగి నడవ లేకుండా ఉన్నాడు" అతడిక మాట్లాడలేదు. మోటర్ సైకిల్ వెనక్కి తిప్పి వెళ్ళిపోయాడు.

* * *

"గుడ్ ఈవినింగ్!" సంధ్య కనవు ఊదుస్తూన్న కళ్యాణి తలెత్తిచూసింది. మరుక్షణం ఆమెముఖం ఎరుపెక్కింది. ఈ సారి అతడి ముఖం నవ్వుని చిందించడం లేదు. అతడి ముఖంలో అదేదో భావం — నిర్లిప్తతా భావం వంటిది కదులాడుతూంది. అతడు నిశ్చలమైన చూపులతో లోపలకు వచ్చాడు. మాణిక్యమ్మ అప్పుడప్పుడే కోలుకోనారంభించినభర్త ప్రక్కనకూర్చుని ఏవో ఇంటివివరాలు చెపుతూంది. స్టూలుపైన కూర్చుని ప్లాస్టిక్ బ్యాగ్ నేస్తూన్న ప్రమీల చటుక్కున లేచి నిలుచుండి. మాణిక్యమ్మ కూడా లేచి నిలుచుంది.

"నమస్కారం. సోము ఎలాగున్నాడు?" మాణిక్యమ్మ బదులివ్వలేదు. గుడ్లప్పగించి చూస్తూ నిలుచుంది. ప్రమీల ప్లాస్టిక్ బ్యాగ్ని క్రింద పెట్టి, "జ్వరం లేదు. నీరసం ఇంకా పోలేదు. ఊపిరి బరువుగా తీస్తున్నాడు-" బదులిచ్చింది. వెంకట్రామయ్య నీరసంగా చూస్తూ గోడకి జేరబడి కూర్చున్నాడు.

"నాకొక చిన్నసహాయం చేయండి. రెండు హార్లిక్సు బాటిల్సు, ఓ గ్లూకోస్ డబ్బా, ఒక నెస్ కేఫ్, పాలడబ్బా తీసుకు రండి." అని ఓ నూరు రూపాయల నోటుని ప్రమీలకు అందిచ్చాడు.

ప్రమీల కదలలేదు. ఆ నోటుని అందుకోలేదు.

"ప్రమీలా! ప్లీజ్ డూ యిట్!" అతడి గొంతు ప్రాధేయపూర్వకంగా వుంది. అదే సమయాన వేదనాభరితంగా వుంది. ఈసారి ఏదో అదృశ్యశక్తి ముందుకు తోస్తున్నట్లు నోటుని అందుకొని, యాంత్రికంగా కదిలింది.

"ప్రమీలా, ఆగు!" కళ్యాణి గొంతు వినిపించడం, ఆ మరుక్షణం చెంప ఛెళ్ళుమనడం ఒకేసారి జరిగిపోయాయి.

"సిగ్గులేదూ!" కళ్యాణి గొంతు వణుకుతూంది. అతడు చలించలేదు. విస్మయం, తీవ్ర వేదన అతడి ముఖంలో క్షణకాలం కనిపించి మాయమయాయి. అన్నిటినీ తను ముందే ఎదురు చూసినట్లు అతడు నిదానంగా కళ్యాణిని సమీపించి, ఎవరూ ఎదురు చూడని విధంగా ఆమె భుజం గట్టిగా పట్టుకొని తన వేపు లాగాడు. అది ఆకస్మికోన్మాదమా లేక ఆవేశపుపొంగో తేల్చుకునేందుకు వాళ్ళకు సాధ్యంకాలేదు.

"ఈసారిగాని అడ్డు తగిలావంటే బలాత్కారం ఉపయోగించడానికి వెనుదీయను. నీ తమ్ముడిపైన నీకు అధికారం ఉండ వచ్చు. నాకు ప్రేమ ఉంది. ఇది గుర్తుంచుకో!" కళ్యాణి కోపంతో ఏదో అనాలని ప్రయత్నించింది. కాని ఏమీ అనలేక పోయింది. పెదవులు మాత్రం వణుకుతున్నాయి. మాణిక్యమ్మ భర్త ఇదంతా విదానంగా చూస్తూ గోడకి జేరగిలబడిఉన్నారు. అతడి వాలకాన్ని బట్టి చూస్తే అతడికి మాట్లాడేందుకు శక్తిలేదు.

ముఖ్యంగా అతడు మాట్లాడేందుకు ప్రయత్నించలేదు.

"ప్రమీలా! ప్లీజ్. క్విక్!" ప్రమీల పంచి తీసుకొని బయటకు నడిచింది.

మరి కాసేపటికి ఆ యింటిముందు ఒక అంబాసిడర్ కారు ఆగింది. అందులోనుంచి డాక్టరు, నర్సు దిగుతున్నారు.

* * * *

తమ్ముడి ఆరోగ్యం తేరుకున్న తరవాత శ్రీనివాసరావు ఇంటికి తరచుగా వస్తాడని ఊహించిన కళ్యాణి ప్రతి సాయంత్రం ఫ్రెండుతో షార్టుహాండు ప్రాక్టీసు చేయాలన్న నెపంతో బయటకు వెళ్ళిపోయేది. ఒక వేళ అలా బయటకు వెళ్ళనినాడు వంటగది లోనే కాలం గడిపేది.

అతడు ప్రతి సాయంత్రం వచ్చి సోముతో కాసేపు క్యారమ్సు ఆడి, తండ్రి గారితో మాట్లాడి వెళ్ళిపోయేవాడు.

ఈమధ్య కళ్యాణికి అధికంగా కోపం రాసాగింది. ప్రశాంతి అనే చెలియలికట్టను ఎంత బలంగా కట్టాలని ప్రయత్నించినా కోపం కట్టలు తెంచుకొని ప్రవహిస్తూంది. అకారణంగా అందరిపైనా కోపం వస్తూంది. చివరకు తనపైన తనకే కోపం వస్తూంది. తమ కుటుంబ పరిస్థితివల్ల ఒక స్ట్రేంజర్కి ఎంత తేలిగ్గా ఇంట్లో ప్రవేశం లభించింది. ఆమె ఆత్మాభిమానం గట్టిగా దెబ్బతింది.

కళ్యాణి మనః పరిస్థితిని మొదట తల్లి గమనించింది. వంటగదిలో పరధ్యానంగా ముడుచుకూర్చుని ఆలోచిస్తున్నప్పుడు మాణిక్యమ్మ మెల్లగా అక్కడికి వచ్చి కూతురి తలపై ఆప్యాయంగా చేతినివుంచి ఇలా అంది. "పిచ్చిదానా! ఎందుకిలా అశాంతితో బాధపడతావు? ఆ కుర్రాడికి మీ తమ్ముడిపైన ప్రేమ. మీ తమ్ముడికి కూడా అతడిపైన అభిమానం. అందుచేత అతడు అప్పుడప్పుడు వచ్చి పోతుంటాడు. ఇంతదానికి ఎందుకిలా కలతతో మనసు పాడు చేసుకుంటావు? అతడు ఖర్చుచేసిన డబ్బులిన్ని మనం తిరిగి ఇవ్వకుండానే పోతామా?"



ఏ కారణం వల్లనో తెలియదు. శ్రీనివాసరావు మూడు రోజులు వరుసగా రాలేదు. ఆ తరవాత మళ్ళీ రావడం ఆరంభిస్తాడని కంపితురాలై ఎదురుచూసింది. కాని అతడు రాలేదు. కళ్యాణి మనసు తేలికపడింది. మనసున ఉత్సాహం చోటుచేసుకుంది. ఇప్పటికైనా దయతలచి తనను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాడు!

మరో మూడురోజుల తరువాత కళ్యాణికి ఓ కంపెనీలో జూనియర్ స్టెనోగ్రాఫర్ ఉద్యోగం వచ్చింది. అపాయింట్‌మెంటు ఆర్డరు అందుకున్న ఆ రోజంతా ఆమె మనసు ఆనందడోలికల్లో తేలియాడింది. జీతం తక్కువే! కాని అది తెచ్చిన మనశ్శాంతిఅపరిమితం.

ఆ రోజు సాయంత్రం—దీపాలు పెట్టే వేళ దేవుడి పటం ముందున్న ప్రమిదలలో వత్తి సర్దుతూ కూర్చుంది కళ్యాణి. అపుడు సోమురొప్పుతూపరిగెత్తుకొచ్చి'అక్కయ్యో' అని పిలిచి, ఆ తరవాత ఏమనుకున్నాడో ఓసారి బెరకుగా చూసి లోపలకు పరుగెత్తాడు.

"అమ్మా! అమ్మా!"

"ఏమిట్రా ఆ గావు కేకలు?"

"శ్రీనివాసరావుగారు వెళ్ళిపోతున్నారమ్మా!"

"ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారా? ఎప్పుడు?"

"తెలియదు. అడగడం మరచిపోయాను"

మాణిక్యమ్మ మౌనంగా ఉండిపోయింది. శ్రీనివాసరావు ముఖం ఆమె కళ్ళముందు మెదిలి. ఆమె మనసు కరిగింది.

* * *

ఉదయం తొమ్మిది గంటలవుతుంది

కళ్యాణి కొన్ని నిమిషాలపాటు దేవుని పటంముందు ధ్యానించి తల్లి అందించిన టిఫిన్ బాక్సు అందుకుని ఆఫీసుకి బయలుదేరింది. ఆమె అలా నడచి వెళ్ళడం చూసి వెంకట్రామయ్య కళ్ళలో నీరు నిండింది. పెళ్ళికూతురు కావాల్సినవయసులో కూతురు బ్రతుకుతెరువుకోసం ఆఫీసుకు వెళుతోంది! అతడి దృష్టిలో అమ్మాయిలు ఉద్యోగం చేయటం ఆక్షేపణీయమనికాదు. కాని తను బ్రతికుండగానే తనతోబాటు తన కూతురు కుటుంబ భారాన్ని మోయవలసి వస్తుందని తను ఎదురు చూడలేదు!

కళ్యాణి కొద్దిసేపు నడచిన తరువాత ఆమె చెవులకు ఎక్కడినుంచో మోటార్ సైకిల్‌శబ్దం వినిపించింది. అప్రయత్నంగా ఆమె నడక వేగం తగ్గింది. మోటార్ సైకిల్ అతనిదేనా? ఆమె తన ఆలోచనను వెంటనే పారద్రోలి ముందుకు కదిలింది. ఆమె అలా రెండడుగులు వేసినవెంటనే మోటార్ సైకిల్ ఆమె కెదురుగా వచ్చి నిల్చింది. "గుడ్ మార్నింగ్!" శ్రీనివాసరావు దిగి, బండిని ఓ మూల నిల్చోబెట్టి. ఆమెను సమీపించాడు.

"క్షమించాలి. కొత్తగా ఉద్యోగంలో చేరారని విన్నాను. మిమ్మల్ని డిస్టర్బ్ చేయడం నా ఉద్దేశ్యం కాదు. మీతో రెండు మాటలు చెప్పాలి. ఐదు నిమిషాలటైం నా కోసం వెచ్చిస్తే నేను సంతోషిస్తాను."ఆమె మాట్లాడలేదు. ఓసారి అతడి ముఖంలోకి తేరిపార చూసి తల దించుకుంది. ఆ తరవాత అతడితోబాటు మెల్లగా నడవసాగింది.

ఆ బాట విశాలమైనది. ఇరువైపులా బొగడచెట్లు వరసగా నిలుచుని పెనవేసుకొని గుసగుసలాడుకుంటున్నట్లు కనిపిస్తాయి. ఎంతటి తీవ్రమైన వడగాల్పయినా సరే—ఆ బాటలోకిగాని వస్తే ఆ చెట్ల పచ్చదనాన్ని పూసుకొని.చల్లదనాన్ని నింపుకొని మలయ మారుతం వలె మారుతుంది.

శంకాన్విత స్వాంతయైన కళ్యాణిని అతడు కొన్ని క్షణాలపాటు పరీక్షగా.పరిశీలనగా చూసి, ఆమె ముఖం మీద ప్రతిఫలించే భావచ్ఛాయల గమకాలు గమనిస్తూ ఓ సారి నిట్టూర్పు విడిచి అతడు చెప్పడం ఆరంభించాడు.

"మొదట మిమ్మల్ని క్షమించమని కోరుకుంటున్నాను. ఆ రోజు మీ యింట్లో వయలెన్సు ప్రదర్శించాను. ఏకవచన ప్రయోగం చేశాను. అందుకు నేను సిగ్గుపడుతున్నాను. ఎందుకో తెలియదు. ఆ క్షణాన నేను గాని పూనుకొనకపోతే సోము చచ్చిపోతాడన్న భయం కలిగింది. నా భ్రమ గావచ్చు, మీ తమ్ముణ్ణి మీరు వదిలేస్తారా? రెండవ విషయం—మిమ్మల్ని పొందాలని ఆశించడం. ఈ ప్రయత్నానికి మీరు మరోమారు నన్ను క్షమించాలి. మీరంటే నాకు ఇష్టం. మిమ్మల్ని చూసిన తరవాత,మీ గృహాన్ని చూసిన తరువాత ఓ సత్యాన్ని గ్రహించగలిగాను.లేమిలో కూడా ఓ హుందాతనం, ఓ స్వచ్ఛత, ఓ విధమైన అలంకారం వుంటాయన్న సత్యాన్ని గ్రహించాను. మీ ఆత్మగౌరవాన్ని చూసి నేను చలించిపోయాను. నన్ను నమ్మండి. ఒకరు ఇష్టపడినంత మాత్రాన ప్రేమ పుట్టదు. ప్రేమ ఆరతి వంటిది. ఆ ఆరతి నుంచి వచ్చే కాంతి పూజచేసేవారిపైనా పడుతుంది. పూజను స్వీకరించే దేవుడిపైనా పడుతుంది. ఇది ఒక కవిగారి ఉపమానం. అలా ఇరువురిపైనా పడినప్పుడే పూజవుతుంది, భక్తి అనబడుతుంది. ప్రేమ అటువంటిదే! కాంతి నాపైనే పడింది గాని దేవతపైన పడలేదు. నా ఓటమిని ఒప్పుకోవడానికి నేనేమాత్రం జంకడం లేదు." అతడు చెప్పడం ఆపుచేశాడు. ఆవేశంతో అతడి ఊపిరి బరువుగా వస్తూంది.ముఖం కళావిహీనంగాఉంది.కాసేపు తరవాత అతడు చెప్పనారంభించాడు.

"అసలు విషయానికి వస్తాను.మీతమ్ముడి కోసం నేను ఖర్చు చేసిన సొమ్ము మొత్తం నాలుగు వందల డెబ్బై రూపాయలు. సోముకి ఖర్చు చేసిన సొమ్ము అడుగుతుంటే నాకు గుండె కోతగా వుంది. అయినా మీ ఆత్మాభిమానం ముఖ్యం. నిదానంగా అప్పు తీర్చండి. అయితే ఒక చిన్న రిక్వెస్టు. నాపైన కోపం కొద్దీ వడ్డీ చేర్చి ఇవ్వడానికి ప్రయత్నించకండి. నేను బాధపడతాను.


చెముడుకు చికిత్స

చెవినుంచి చీము, కారుట, చెవిలో గడగడ శబ్దం, చెముడు లేదా చెవికి సంబంధించిన ఏదేని అస్వస్థత పూర్తిగా నయం చేయబడును. ధర రు. 20/– పూర్తి కోర్సు రు. 50/–

A. K. GUPTA VAID (D. F. 3)
P. O. LALBIGHA (NAWADA)

బాలజ్యోతి


జనవరి'84 సంచికలో ప్రారంభం



కరాటే పాఠాలు

ఉన్నత స్థాయిలో ఉత్తమ శిక్షణ నిచ్చి హైదరాబాద్‌లో ఇంతవరకు 300 మందిని కరాటే ప్రవీణులుగా మార్చిన ప్రసిద్ధ కరాటే కోచ్ బ్లూ బెల్ట్ హోల్డర్

శ్రీ కె. ఎల్. సురేందర్ రచన




ఇది మా ఊరి అడ్రసు. నాది ఊళ్లు తిరిగే ఉద్యోగం కాబట్టి సొమ్ము మా ఊరికే—మా అన్నయ్య పేర పంపించండి." అతడు ఆమె చేతికి ఓ చీటీ అందించి వెళ్ళిపోయాడు.

* * *

శ్రీనివాసరావు జనరల్ మేనేజరు ఛాంబర్‌లో కూర్చుని కంపెనీ వ్యవహారాలపై సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల సమక్షాన చర్చలు జరుపుతున్నాడు. ముఖ్యమైన ఆ కాన్ఫరెన్సుకు జనరల్ మేనేజరు అధ్యక్షత వహించాడు. వారలా ఉదయం ప్రారంభించిన చర్చల్ని ఏకబిగిన సాగిస్తూనే ఉన్నారు. అప్పుడు ఫోను ఖంగున మ్రోగడం విని మేనేజరు రిసీవరు అందుకున్నాడు. రెండు మాటలు మాట్లాడి. "మిస్టర్ శ్రీనివాసరావు. మీ కోసం ఎవరో విజిటర్ చాలా సేపటినించి వెయిట్ చేస్తున్నారట" అని కబురందించి సంభాషణలో మునిగిపోయాడు. శ్రీనివాసరావు ముఖం చిట్లించి "ఎక్స్క్యూజ్ మి" అంటూ బయటకు నడిచాడు.

అతణ్ణిచూసి రిసెప్షనిస్టు లేచి నిలుచుంది.

"వెరీ సారీ సార్! ఈ విజిటర్ చాలా సేపటినించి ఎదురు చూడటంవల్ల మిమ్మల్ని పిలవ్వాలసి వచ్చింది."

"దట్సాల్ రైట్!" అతడు చూపులు సారించి, ఎదురుగా వస్తున్న విజిటర్‌ను చూసి, ఆశ్చర్యంగా నిల్చుండిపోయాడు.

"నువ్వా ప్రమీలా!" ఆమె వెంటనే మాట్లాడలేదు. చెమ్మగిల్లిన కళ్ళతో అతడి వేపుచూసి. "మీకు తీరిక చిక్కితే ఈ రోజు సాయంత్రం మా యింటికి వస్తారా?" అని అడిగింది.

"వస్తాను. ఎందుకు?"

"అక్కయ్య వారంరోజులుగా జ్వరంతో బాధపడుతుంది. అక్కయ్య ఉద్యోగంలో చేరి నెల రోజులుకూడా కాలేదు. ఆఫీసుకి ప్రతి ఉదయమూ ఉత్సాహంతో వెళ్ళే అక్కయ్య అలా అకస్మాత్తుగా జబ్బుపడడం నాన్నను క్రుంగదీసింది. ఊడ బెరికిన మొక్కలా అక్కయ్య ఎందుకిలాతయారయిందీ ఈరోజు ఉదయం తెలుసుకున్నాను."

"ఏమిటది?"

"నేను నమ్మలేకపోయాను. మీరుకూడా నమ్మలేరు."

"చెప్పు ప్రమీలా!"

"అక్కయ్య మీ పేరు పలవరిస్తూంది."

అతడు ఆశ్చర్యమే తానై చూశాడు.

"నేను మీ వద్దకు రావడం ఎవ్వరికీ తెలియదు."

"మీ అక్కయ్యకు?"

"దానికి కూడా తెలియదు. తప్పకుండా వస్తారు కదూ?"

అతడు మౌనంగా తలూపాడు. ప్రమీల "థ్యాంక్సు" అంటూ నడిచి వెళ్ళిపోయింది.

* * *

అతడు ఇంటి గుమ్మం చేరుకునేటప్పటికి చిరు చీకట్లు చెట్టా పట్టాలేసుకొని వీధుల్లో గెంతులు వేస్తున్నాయి.

గుమ్మం వద్ద అలికిడి విని ప్రమీల ఎదురొచ్చింది.

"ఏమిటి ప్రమీలా, ఈ రోజు మీ ఇల్లు ఇంత నిశ్శబ్దంగా ఉంది?"

"ఉష్! అందరూ విశ్వనాథస్వామి గుడికెళ్ళారు. నేను పక్కింటిలో కూర్చుంటాను. త్వరగా మాట్లాడిరండి. అరగంటలో సంభాషణ ముగియాలి." అతడు తలూపాడు కాని ప్రమీల కదలలేదు. "చిన్న ప్రార్థన" అతడు ఏమిటన్నట్లు చూపులతో అడిగాడు. "మా అక్కయ్యను బాధించకండి. మా అక్కయ్యకు రోషం ఎక్కువయినా దానిది మంచిమనసు." శ్రీనివాసరావు నవ్వాడు. అతని ముఖంలోకి తేరిపార చూస్తూ ప్రమీల బయటకు వెళ్ళిపోయింది.

అతడు మెల్లగా గది తలుపు తీసి లోపలకు చూశాడు. గోడకు చేరబడి, చేతులను మోకాళ్ళ చుట్టూ పోనిచ్చి, కళ్ళు మూసుకొని కూర్చుంది కళ్యాణి. ఆమె ముఖం చూసి అతడిగుండె చెరువయింది. ముఖం ఎంత నీరసించిపోయింది! అతడు ఆమెకు దగ్గరగా వెళ్ళి, "కళ్యాణీ!" అని మృదువుగా పిలిచాడు. ఆమె మెల్లగా కనురెప్పల్ని విప్పి, ఎదురుగా నిల్చున్న శ్రీనివాసరావుని నమ్మలేనట్లు చూసింది. ఆ తరువాత నెమ్మదిగా, ప్రయత్నపూర్వకంగా లేచి నిల్చుని అతడి ముఖంలోకి తేరిపార చూసింది.

ఆమె అలా నిల్చున్నప్పుడు తెలిసింది. కళ్యాణి నీరసించిపోవడమే కాదు, సన్నబడిపోయింది కూడా! ఆమె కొన్ని క్షణాలు ఆశ్చర్యంగా అతడి ముఖంలోకి చూస్తూ నిల్చోవడంచూసి అతడికేమిచేయాలో తోచలేదు. ఆమె వాలకం చూసి అతడిలో తీక్షణమైన భయవీచిక పారాడింది.

"కళ్యాణీ!" అతడి గొంతులో ఆర్ద్రత తొణికిసలాడింది.

"ఉష్! నాకు శక్తిలేదు ఎక్కువ సేపు నిల్చోలేను" అని ఆమె మెల్లగా వంగి, అతడి పాదాలపైన రెండుచేతులూ వేసింది. అతడు కదలలేదు. వేడి కన్నీటి చుక్కలు తన పాదాలపైన పడుతూండడం అతడికి తెలుస్తూనే ఉంది.

"నన్ను క్షమించానని ఓమారు చెప్పండి. మీరుగాని అలా అనకపోతే నేను తేరుకోలేను. జ్వరంతో బాధపడుతూ చచ్చిపోతాను" అతడు మెల్లగా వంగి ఆమెను లేవనెత్తాడు. ఆమె ఉలిక్కిపడి చూసింది. అతడి కళ్ళనుంచి కన్నీటిబిందువులురాలిపడుతున్నాయి.

"ఏడుస్తున్నారా?" ఆమె అతడి ముఖాన్ని దగ్గరకు లాక్కుని గుండెపై ఉంచుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ●

